క్లుప్తంగా

పన్నులు చెల్లించి సహకరించాలి



డీసీ అలీకి చెక్కు అందజేస్తున్న మురళీ మోహన్, నర్సింగ్‌రావు

మలక్‌పేట: పన్నులు చెల్లించి సహకరించాలని జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్‌–6 డిప్యూటీ కమిషనర్ అలీ కోరారు. సర్కిల్ పరిధిలో అధికారులు ఆగస్టు నెల టార్గెట్‌లో భాగంగా శనివారం ఒక్కరోజే రూ.5.70 లక్షలు ట్యాక్స్ వసూలు చేశారు. అక్బర్‌బాగ్‌లోని కార్యాలయంలో ఏఎంసీ మురళీమోహన్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావుతో కలిసి డీసీకి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్‌రావు, బిల్ కలెక్టర్ స్నేహిత్‌కుమార్ ఉన్నారు.

పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి బృందావన్‌మెడోస్‌కాలనీలో జరుగుతున్న రాచకాలువ పనులను హైడ్రా అధికారులు పరిశీలించారు. 36 ఫీట్ల రోడ్డుపై ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గేదిలేదని, డ్రైనేజీ పనులను కూడా రాచకాలువ పనుల్లో భాగంగానే చేపట్టాలని జలమండలి, సివరేజీ బోర్డు మేనేజర్ సిరివెన్నలకు సూచించామని హైడ్రా అధికారులు పేర్కొన్నట్లు కాలనీవాసులు తెలిపారు.

మార్వాడీల దోపిడీని అడ్డుకుందాం



నిరసన తెలుపుతున్న నేతలు

మన్సూరాబాద్: మార్వాడీలు చేస్తున్న వృత్తి దోపిడీని నిరసిస్తూ విశ్వకర్మల ఎల్‌బీనగర్ కమిటీ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని బీసీ మహనీయుల విగ్రహాల వద్ద శనివారం భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ నేతలు మాట్లాడుతూ.. మార్వాడీలు చేస్తున్న వృత్తి దోపిడీతో విశ్వకర్మల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన చెందారు. విశ్వకర్మలకు గ్రామాల్లో కూడా పనులు లేకుండా పోతున్నాయన్నారు. విశ్వకర్మలు ఐక్యతతో వ్యవహరించి వృత్తి దోపిడీని అడ్డుకుందామని పిలుపునిచ్చారు.

అక్రమ నిర్మాణ పనుల నిలిపివేత

నాగోలు: జైపురికాలనీ సమీపంలోని శ్రీ సాయినారాయణ కాలనీ రోడ్ నంబర్‌–2లోని పార్కు స్థలంలో అక్రమంగా షెడ్డు నిర్మాణ పనులు పనులు చేస్తుండగా స్థానికులు జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ ఏసీపీ విజయలక్ష్మి ఆదేశాలతో శనివారం జీహెచ్ఎంసీ సిబ్బంది పార్కు స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డు పనులు నిలిపివేశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీసీ సుజాత

దిల్‌సుఖ్‌నగర్/ఎల్‌బీనగర్: నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ సుజాత సూచించారు. శనివారం కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ సమితి సభ్యులతో ఆర్‌కేపురంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నిమజ్జనం సందర్భంగా సరూర్ నగర్ చెరువు కట్టపైన 10 మంది గజ ఈతగాళ్లు, 200సీసీ కెమెరాలు, 1500 స్ట్రీట్‌లైట్లు బారికేడ్లు,తాగునీరు సమకూర్చమన్నారు. మండపాలు, చెరువుల, బేబీ పాండ్ల వద్ద ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రాధా ధీరజ్‌రెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, ఆకుల శ్రీవాణి, రంగ నర్సింహా గుప్తా, బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, ఎస్ఈ వి. అశోక్ రెడ్డి, ఎల్‌బీనగర్, వనస్థలిపురం ఏసీపీలు కృష్ణయ్య, కాశిరెడ్డి పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయంలో...

ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయంలో డీసీ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో వివిధ విభాగాల అధికారులతో వినాయక చవితి ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బానోతు సుజాత నాయక్, వంగ మధుసూధన్‌రెడ్డి, ఈఈ కార్తీక్ ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస్..

అమలు తుస్



నిరాశలో లబ్ధిదారులు | స్పష్టత ఇవ్వని ప్రభుత్వం | అయోమయంలో అధికారులు

చాదర్‌ఘాట్: యువతకు చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. దరఖాస్తులు సమర్పించి సుమారుగా ఐదు నెలలు కావొస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవటంతో యువత ఆశలు అడియాశలు అయ్యాయి. వాస్తవానికి జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాయితీ రుణాలు మంజూరు పత్రాలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొంది. రాయితీ రుణాల పంపిణీపై సందిగ్ధత నెలకొనడంతో దరఖాస్తుదారులు జీహెచ్ఎంసీ కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.



దరఖాస్తుల స్క్రూటినీ చేస్తున్న సిబ్బంది

మళ్లీ ఎప్పుడో..

ప్రభుత్వం రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు రాయితీ రుణాల మంజూరుకు ప్రణాళికలు రూపొందించడంలో చాలా మంది రూ. 3 లక్షల నుంచి 4 లక్షల యూనిట్లకు ప్రాధాన్యం ఇచ్చారు. జిల్లాస్థాయి కమిటీలు లబ్ధిదారుల ఎంపిక కసరత్తు చేయాల్సి ఉండగా ప్రభుత్వం నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను నిలిపివేయాలని ఆదేశాలు రావడంతో ఆగిపోయింది. మళ్లీ ప్రభుత్వ ఆదేశాలు మేరకే లబ్ధిదారుల ఎంపిక తుది దశకు చేరుకునే అవకాశం ఉంది. రుణాలపై సంబంధిత అధికారులకు ఎలాంటి స్పష్టత లేకపోవడంతో తరచూ కార్యాలయాలకు వస్తున్న లబ్ధిదారులకు సమాధానం చెప్పలేకపోతున్నామని కొందరు అధికారులు చెప్పుకొచ్చారు.

అర్హులుగా 4252 మంది

ఓల్డ్‌మలక్‌పేట, అజంపురా డివిజన్ల పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకం కోసం 8752 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో అన్ని ధృవ పత్రాలను పరిశీలించిన తర్వాత 4252 మందిని అర్హతగా నిర్ధారించారు. వీటన్నింటిని సంబంధిత అధికారులు ఆయా బ్యాంకులకు పంపించారు. బ్యాంక్ అధికారులు వీటిని మళ్లి స్క్రూట్నీ చేసి రుణాలకు అర్హత ఉన్న వారికి ఇవ్వాలని సూచించారు. ఈ ప్రక్రియ ఇంత వరకే నిలిచిపోయింది. ఈ పథకానికి నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ సామాజిక వర్గాల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి.

కేబుళ్ల తొలగింపు నిలిపివేయాలి



మాట్లాడుతున్న జితేందర్

చంపాపేట: విద్యుత్ స్తంభాలకు కేబుల్ టీవీ, ఇటర్నెట్ సౌకర్యాలు కల్పించే విద్యుత్ ప్రవాహ నిరోధక ఫైబర్ ఆప్టిక్ కేబుళ్ల తొలగింపును నిలిపివేయాలని రాష్ట్ర కేబుల్ టీవీ, ఇంటర్‌నెట్, టెలీకాం సర్వీసెస్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ కోరారు. శనివారం చంపాపేటలోని సంఘం కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేబుల్ టీవీ, ఇంటర్‌నెట్ కేబుల్ కనెక్షన్లతో రాష్ట్రంలో 40 లక్షల మంది ఇంటర్‌నెట్, 30 లక్షల మంది కేబుల్ కనెక్టవిటీ, కోటి మంది టెలీకాం సేవలు పొందుతున్నారని దీంతో ప్రతీ ఏటా 18 శాతం జీఎస్టీ, లైసెన్స్ ఫీజ్ 8 శాతం పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్నారు. కేబుల్ కనెక్షన్లతో రాష్ట్రంలో 25 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని వాటిని తొలగించటంతో వారి కుటుంబాలు వీధిన పడే ప్రమాదం ఉందన్నారు. కొంత సమయం ఇస్తే విద్యుత్ స్తంభాలకున్న కేబుళ్లను క్రమబద్ధీకరించి ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేస్తామన్నారు. ఈ సమావేశంలో సతీష్ , వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే వరద కాలువ పనులు పూర్తిచేస్తాం



వరదకాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: నియోజకవర్గ అభివృద్ధికి గతంలోనే నిధులు మంజూరైనా కొన్ని పనులు ఇంకా కార్యరూపం దాల్చలేదని, వెంటనే ఆ పనులను సకాలంలో పూర్తిచేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌ను కోరారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఆగమయ్యనగర్, కాస్మోపాలిటన్‌కాలనీ, ఓల్డ్ విలేజ్, వీకర్‌సెక్షన్‌కాలనీలలో శనివారం ఆయన జెడ్సీతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆగమయ్యనగర్‌కాలనీలో నిర్మిస్తున్న వరదకాలువ పనులను త్వరలోనే పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కాస్మోపాలిటన్‌కాలనీలోని పార్కు అభివృద్ధి, ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కాముకికాంత, కుమ్మరిబస్తీలోని నిలిచిపోయిన కమ్యూనిహాళ్లకు నిధులు మంజూరు చేయించి పూర్తి చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విఠల్‌రెడ్డి, జగదీష్‌యాదవ్, నర్సింహ్మగౌడ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

హస్తినాపురం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచించారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని ద్వారకానగర్‌కాలనీలో శనివారం ఆయన జెడ్సీ హేమంత్ కేశవ్‌పాటిల్‌తో కలిసి పర్యటించారు. ఎన్నికల ముందు వరదనీటి డ్రైన్స్ పనులు పూర్తిచేశామన్నారు. రోడ్డు పనుల్లో భాగంగా డీఆర్‌డీఎల్ కాలనీ, ద్వారకానగర్ కాలనీల రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని జెడ్సీకి వివరించారు. వారి వెంట రమావత్ పద్మానాయక్ , శ్రీనివాస్‌నాయక్ ఉన్నారు.

యువత రక్తదానం చేయాలి



రక్తదాతలకు సర్టిఫికెట్ ఇస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: రక్తదానం చేయడానికి యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. ప్రపంచ సోదర దినోత్సవం సందర్భంగా రాజయోగిని ప్రకాశమణిజీ 18వ, ఆరోహణ దినోత్సవం పురస్కరించుకుని అక్బర్‌బాగ్‌లోని బ్రహ్మకుమారీస్ సెంటర్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. భారత ప్రభుత్వం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ, ఐఎస్‌బీటీఐ, రెడ్ క్రాస్ సొసైటీ ఆఫ్ ఇండియా, రోటరీ ఇంటర్ నేషనల్, లయన్స్ ఇంటర్ నేషనల్ వంటి సంస్థల సౌజన్యంతో బ్రహ్మకుమారీస్ సోషల్ సర్వీస్ వింగ్ ఆధ్వర్యంలో తలసీమియా బాధితుల కోసం చేపట్టిన శిబిరంలో రక్తదానం చేసిన వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీకే ఉమారాణి, డాక్టర్ రవి, సిస్టర్, బ్రదర్స్ పాల్గొన్నారు.

పనుల పరిశీలన..

చాదర్‌ఘాట్: అజంపురా డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పరిశీలించారు. అజంపురా టార్జాన్ పార్క్‌లో చిన్నారుల కోసం రూ.36 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న మైదానం, పార్కు పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రంథాలయం పనులను త్వరగా పూర్తి చేయాలని డివిజన్‌లో జరుగుతున్న పనుల్లో వేగం పెంచాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మన్సూరాబాద్: బీసీ ఇంటలెక్చువల్ ఫోరం, రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో మన్సూరాబాద్ బాలాజీనగర్‌కాలనీలోని స్వకుళశాలి భవనల్‌లో ఈ నెల 25న బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫోరం కమిటీ సభ్యుడు చామకూర రాజు తెలిపారు. శనివారం సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బీసీ సదస్సుకు ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు హాజరవుతున్నట్లు తెలిపారు. బీసీ విద్యార్థి, నిరుద్యోగ, ఉద్యోగ, కార్మికులు, కర్షకులు, మేధావులు హాజరవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీగౌడ్, దుర్గయ్యగౌడ్, జైహింద్, ఆంజనేయులు, శేఖర్,శ్యాంసుందర్, ఉపేంద్రయాదవ్, అనంతుల శ్రీనివాస్, మారోజు రామాచరి, లింగస్వామి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చైతన్యపురి: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఓ పేద మహిళకు చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోటమహేష్‌యాదవ్ ఆర్థిక సాయం చేశారు. చైతన్యపురికి చెందిన శివమ్మ భర్త వెంకటయ్య, కుమారుడు కృష్ణ ఇద్దరూ ఇటీవలే మృతిచెందారు. దీంతో ఒంటరిగా ఉన్న శివమ్మ ఆర్థిక ఇబ్బందులలో ఉన్న విషయం తెలుసుకున్న మహేష్ యాదవ్ ఆమె ఆర్థిక సహాయం చేశారు.

ప్రశాంత్ కుమార్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందజేస్తున్న రాజ్‌కుమార్

నాగోలు: బైబిల్ థియోలాజీలో పీహెచ్‌డీ పూర్తి చేసిన కొత్తపేటకు చెందిన జీసస్ క్రీస్తు యునైటెడ్ ప్రేయర్ హౌస్ వ్యవస్థాపకుడు ప్రశాంత్‌కుమార్‌కు ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ చర్చి మేనేజ్‌మెంట్ వారు డాక్టరేట్ అందజేశారు. శనివారం చెన్నైలోని వండలూరులో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ వేడుకల్లో ప్రిన్సిపాల్ రెవరెండ్ సి.రాజ్‌కుమార్ చేతులమీదుగా డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భగా ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ..క్రీస్తే ఇన్ ది ఓల్డ్ టెస్టమెంట్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నాడు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

నాగోలు: విద్యార్థులు కంటి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని డాక్టర్ జవహర్, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ డాక్టర్ విజయరంగ అన్నారు. శనివారం కొత్తపేట డివిజన్ మోహన్ నగర్‌లో బచ్‌పన్, అకాడమీ హైట్స్ పాఠశాలల్లో విద్యార్థులకు లయన్స్ క్లబ్ హైదరాబాద్ కొత్తపేట ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.41, వంకాయ రూ.23, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.50, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.47, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.15, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.12, చిక్కుడుకాయ రూ.65, చామగడ్డ రూ.28.

సురవరం సుధాకర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

సైదాబాద్: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ అన్నారు. శనివారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధి సింగరేణి కాలనీలోని గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సీపీఐ నాయకులతో కలిసి సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో శంకర్ నాయక్, సక్రిబాయి, దశరథ్, రూప్‌సింగ్, రేష్మా, వెంకటేష్ పాల్గొన్నారు.

సురవరం చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

మన్సూరాబాద్: సురవం సుధాకర్‌రెడ్డి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి కోరారు. సీపీఐ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లో శనివారం సురవరం సంతాప కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శేషరాజుపల్లి శ్రీదేవి, సుజాత, సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, బొంగు అరుణ్‌కుమార్‌గౌడ్, సరిత, అరుణ, పారిజాత, యమున, సుమతి, జ్యోతి పాల్గొన్నారు.

ఎస్‌కే డాంగే భవన్‌లో..

నాగోలు: సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర ప్రజా సంఘాల సబ్ కమిటీ సభ్యుల బొడుపల్లి కృష్ణ అన్నారు. న్యూనాగోలులోని ఎస్‌కే డాంగే భవన్‌లో సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సురవరం విద్యార్థి దశ నుంచే భాతర దేశ అగ్ర నాయకుడిగా ఎదిగిన నాయకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, కుమార స్వామి, నర్సింహ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



హయత్‌నగర్: ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ(స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో శనివారం హయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ఫీజు రీయింబర్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల ఊసే ఎత్తడం లేదని, విద్యార్థుల సమస్యలను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హరీష్, సూర్య, పాష, ప్రణయ్, వంశి, సాయి పాల్గొన్నారు.

7 నిమిషాల్లో వెళ్లి.. ప్రాణాలు కాపాడి

హస్తినాపురం: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను సకాలంలో స్పందించి కాపాడిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మన్సూరాబాద్ డివిజన్ సహారాఎస్టేట్‌కాలనీలో ఉంటున్న మహిళ శుక్రవారం రాత్రి ఆత్మహత్యయత్నానికి పాల్పడుతున్నట్లు వనస్థలిపురం పోలీసులకు సమాచారం రావడంతో క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకుని తలుపులు పగులగొట్టి ఫ్యాన్‌కు ఉరివేసుకోవడానికి యత్నిస్తుండగా కానిస్టేబుళ్లు రాంబాబు, నరేశ్ కాపాడారు. ఫోన్ కాల్ వచ్చిన ఏడు నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుని గృహిణిని కాపాడిన రాంబాబు, వ్యాన్ డ్రైవర్ నరేశ్‌ను సీఐ తోట మహేశ్ అభినందించారు.



రంగారెడ్డి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం చిత్ర లేఔట్‌లో బాల్య వివాహ నిర్మూలనపై అవగాహన కల్పించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ సామ్ కోషి హాజరై మాట్లాడారు. బాల్యవివాహాలు చేయడం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కరణ్ కుమార్, న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి, సిటీబ్యూరో

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



కమ్యూనిటీ హాల్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్

సైదాబాద్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి సూచించారు. శనివారం ఆమె ఎల్‌సీహెచ్ కాలనీ, శంకేశ్వరబజార్, కరణ్‌బాగ్ కాలనీల్లో పర్యటించారు. ఎల్‌సీహెచ్ కాలనీలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలించారు. కాలనీల్లో కలుషిత నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ఈ సందర్భంగా కాలనీవాసులు ఆమె దృష్టికి తెచ్చారు. వెంటనే ఆమె వాటర్‌వర్క్స్ మేనేజర్ శ్రవణ్‌కుమార్‌కు సమాచారమిచ్చి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అదే విధంగా కరణ్‌బాగ్ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులను కోరారు.

ప్రజల్లో మమేకమైన వారే నాయకులుగా ఎదుగుతారు



కార్పొరేటర్‌కు పుస్తకాన్ని అందజేస్తున్న బండారు దత్తాత్రేయ

నాగోలు: నిత్యం ప్రజల్లో మమేకమైన వారే నాయకులుగా ఎదుగుతారని హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం ఆయన నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ నివాసానికి వచ్చి ఆయన రచించిన ప్రజలకథే నా ఆత్మకథ పుస్తకాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదవులు శాశ్వతం కాదని రాజకీయాలను కూడా కేవలం ఎన్నికలకే పరిమితం చేస్తూ సమష్టిగా ఉంటూ ప్రజా సంక్షేమానికి పాటుపడాలన్నారు. కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ కుటుంబం పూర్వం నుంచి పేద ప్రజల పట్ల సేవా భావంతో మెలిగేదని ఆయన గుర్తు చేశారు. అనంతరం కార్పొరేటర్ దత్తాత్రేయకు శాలువాలతో సత్కరించి గొంగడిని బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఐలయ్య, మల్లేష్, సంజీవరెడ్డి, వినోద్ రెడ్డి, శివ శంకర్,విజయ్ శంకర్, పంగ శ్యామ్ కుమార్, రావుల శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ నూకల పద్మా రెడ్డి, జక్క గీత రెడ్డి, కాలం శెట్టి లయ, సరస్వతి,మమత, వినోద్ యాదవ్,నరేష్ యాదవ్, యశ్వంత్,శివకుమార్, మునిందర్ పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు



విజేతలతో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ ఈవో సుకన్య

మలక్‌పేట: హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సైదాబాద్ జోన్‌లో మూడ్రోజులుగా నిర్వహించిన క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. మూసారంబాగ్ స్వామి వివేకానంద సెంటనరీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ముగింపు వేడుకలకు కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, సైదాబాద్ డిప్యూటీ ఈవో సుకన్య హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల పట్ల తగిన ప్రోత్సహం అందిస్తే మరింత రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఓం హరికృష్ణ, సుమ, సునీల్‌కుమార్, నరసింహారావు, శుక్రునాయక్, విక్రమ్, స్వరూప, రంజిత్, సాగర్, రాధిక, పాల్గొన్నారు.

అన్నదానం

చంపాపేట: అన్ని దానాల కన్నా అన్నదాం మిన్న అని శ్రీమాతా అన్నపూర్ణేశ్వర అన్న ప్రసాద వితరణ ట్రస్ట్ చైర్మన్ దండేటికార్ భగవాన్‌జీ అన్నారు. శనివారం ట్రస్ట్ ఆధ్వర్యంలో చంపాపేట మూడు గుళ్ల ఆవరణలో నల్ల, ఎర్ర పోచమ్మ అమ్మవారి ఆలయం వద్ద దాతలు శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ పాలక మండలి సభ్యులు కీర్తనాచార్యులు, ఉషశ్రీ దంపతులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భగవాన్‌జీ మాట్లాడుతూ..దాతల సహాయ సహకారాలతో ప్రతీ అమావాస్య రోజు అన్న ప్రసాదాన్ని వితరణ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రవి, సుశీల్‌కుమార్, సంతోష్, ప్రవీణ్, చింటు, రాజు, వెంకటేష్, రాజేష్, రమేష్, శ్రీను, మహేశ్వర్ రెడ్డి, హరిలాల్ పాల్గొన్నారు.

వాసవిక్లబ్‌ఆధ్వర్యంలో..

మన్సూరాబాద్: వాసవి క్లబ్ మన్సూరాబాద్ ఆధ్వర్యంలో సహారాస్టేట్స్‌కాలనీ ప్రధాన గేటు వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వద్ద శనివారం అన్నదానంనిర్వహించారు. వాసవి క్లబ్ నేత మొరిశెట్టి సంతోష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై వాసవి మాతకు పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంజిబాబు, లింగమయ్య, గోపి, వేణు, వెంకటరమణ, యాదగిరి పాల్గొన్నారు.



అన్నదాన వితరణ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు



అన్నదానం చేస్తున్న క్లబ్ నేతలు